ఆనవాలు

శ్రీ జనస్వామి కోదండరామశాస్త్రి

ప్లాట్ ఫారమ్ అదిరిపోయేలా ధ్వనిచేసుకుంటూ వచ్చి చటుక్కున ఆగి వూరుకుంది గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ వరంగల్ సేషన్లో. సెకండ్ క్లాసు కంపార్టుమెంటులో పురుషులందరూ దిగేవరకు కూర్చుని తరువాత చివరి సీటునుండి లేచి నిలబడి ముందుకు సాగివస్తూండగా కాలికి ఏదో తగిలినట్లుగా వుండి క్రిందకు ఒంగిచూసింది డాక్టర్ లలితాదేవి. నల్లగా మెరుస్తూ అందమైన ఒక చిన్న లెదర్ బేగ్ క్రిందపడివుంది. 'అయ్యో? ఎవరో మర్చిపోయారు పాపం!' అని అనుకుంటూ చేత్తో పట్టుకుని ప్లాట్ ఫారమ్ మీదకు దిగి నిలబడి అయిదారు నిమిషాలపాటు వేచి చూసింది దాని యజమాను లెవరైనా వెతుక్కోవడానికి వస్తారేమోనని. కాని ఎంతసేపు చూచినా ఎవరూ రాలేదు. దానిని తన మందులపెట్టెలో పెట్టుకుని ముందుకు నడిచింది.

ఇంటికి వెళ్ళి భోజనం చేసుకుని కాసేపు బడలిక తీర్చుకున్న తర్వాత ఆమెకు ఆ లెదర్ బేగ్ మాట జ్ఞాపకం వచ్చింది. వెంటనే మంచంమీదనుంచి ఒళ్ళు విరుచుకుంటూ లేచివెళ్ళి మేజాబల్లపైనగల మందుల పెట్టెలోని లెదర్ బేగ్ తీసుకుని మళ్ళా మంచంపై ఆశీనురాలై దానిని చిన్నగా తెరిచిచూచింది. అందులో ఒక చిన్న ఫోటో వున్నది. అంతకంటే వస్తువాహనా లేవీ అందులో లేవు. ఎంతోసేపు స్మృతిపథానికి పని కల్గింపకుండానే ఆ ఫోటోలోని రూపాన్ని ఆమె తేలికగానే గుర్తింపగలిగింది. అది తన బాల్యస్నేహితురాలు సుమిత్రయొక్క ఫోటో! ఫోటో వెనకప్రక్కన రెండు జాజిపుష్పాలు అంటుకుని వున్నాయి. ఈ ఫోటో యింత భద్రంగా యీ అందమైన లెదర్ బేగ్‌లో కూర్చుని పూజానివేదనల్ని పొందుతూ అత్యంత ఆప్తంగా చూడబడటానికి కారణమేమిటి? ఒకవేళ యీ ఫోటో పోగొట్టుకున్నవాడు ఆమె భర్తే అయి వుంటాడని అనుకోటానికైనా ఎపుడూ ఎదురుగా వుండే భార్యను చిత్రపటాలద్వారా కూడా యింత గొప్పగా ఆరాధిస్తూ వాటిని రైలు ప్రయాణాలలో కూడా మోసుకుని పోతగినంత మమతలతో పెనవేసుకునే జీవి మగజాతిలో మచ్చుకైనా కన్పించగలడా? అసలు యీ ఫోటో యింత ఉన్నత స్థానము పొందుటకు గల కారణమేమిటి? ఈ సందేహాలకు తగిన జవాబులు మనసులో ఎంత తరచిచూచినా ఆమెకు లభించినవి కావు. కాని సుమిత్ర జీవితకావ్యమున ఏదో ఒకపుటలో స్వర్ణాక్షరములతో లిఖింపదగిన ముఖ్య వృత్తాంతం యిందు ఇమిడివుండవచ్చునని నిర్ణయానికిమటుకు రాగలిగింది!

అసలు ఆమె సుమిత్రను చూచి కనీసం ఇరవై వసంతాలైనా దాటి వుండవచ్చు. ఈమధ్య ఎపుడో ఏవేవో గత స్మృతులను మనసులో తిరుగవేసుకుంటూండగా ఆ కోమల కంఠస్వరం గుర్తుకు తలిగి, తమ ఇరువుర్నీ బాగా ఎరిగివున్న ఒకరికి సుమిత్ర యొక్క అంతుపొంతులను తెలుపవల్సిందిగా కోరుతూ లేఖవ్రాసింది. ఎంతోకాలము పట్టకుండానే వారినుండి జవాబు వచ్చింది. సుమిత్ర యొక్క తల్లిదండ్రులు ఎన్నడో కాలంచేశారనీ, ఆ వెంటనే ఆమె అన్నదమ్ములు మద్రాసులో తమకుగల ఆస్థిపాస్థులన్నిటినీ అమ్మివేసుకుని పోయారనీ, ఇక పోతే సుమిత్ర భర్త చాలా దూర దేశంలో కొంచెం మంచి ఉద్యోగంలోనే వున్నట్లు కొంత కాలంక్రితం ఎవరివల్లనో వినటంతప్ప అంతకుమించిన సమాచారం సుమిత్రనుగూర్చితమ కేమీ తెలియదని తెలియజేశారు.

ఒకవారం రోజులు గడిచిన తదుపరి ఒకనాడు లలితాదేవి దినపత్రిక చూస్తూండగా అందులో యీ క్రింది విధంగా ఒక ప్రకటన కన్పించింది.

"లెదర్ బేగ్ పోయింది.

ఈ నెల 16 వ తేది ఉదయం నేను గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణము సల్పుతూండగా

సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్‌లో పక్క జేబునుండి ఒక లెదర్ బేగ్ జారిపోయింది. ఆ బేగ్ దొరికినవారు అందు తమకు అక్కరపడు వస్తువులేవీ లేవనే తెల్సుకుని వుంటారు. అందులోవున్న ఆ ఒక్క వస్తువూ ఎవరికీ ఏ విధంగానూ పనికి వచ్చేదికాదు. కనుక ప్రస్తుతం బేగ్ స్వాధీనంలో వుంచుకున్నవారు దానిని నాకు అందజేసి నేను ఇవ్వదలచుకున్న ఏడునూర్ల రూపాయల పారితోషికమును పొందుదురుగాక". ఈ ప్రకటన కర్త తన స్వస్థలం నెల్లూరుగా పేర్కొంటూ తన ఫోన్ నంబరు మాత్రము యిచ్చి వూరుకున్నాడు. సంతకం 'సురూజి' అని వున్నది. ఈ విషయమును గూర్చే ఆలోచిస్తూండగా ఆమె వద్దకు వైద్య సంబంధముకు సలహాకొరకు ఒక దీర్ఘరోగి వచ్చాడు. ఆతడు లలితాదేవితో తన అనారోగ్యమును గూర్చి అంతా విన్నవించుకున్న తరువాత ఏదో మాటా మంచీ మాట్లాడుతూ తన చేతిలోని భగవద్గీత పుస్తకాన్ని చూపించి 'డాక్టరుగారూ? పాపం! యీ పుస్తకం ఎవరిదో? ఏమిటో? దీని మీద ఆడవాళ్ళ పేరేదో వున్నది......ఏకాదశాధ్యాయం గల పేజీలలో మొగవాళ్ళ దెవరిదో ఫోటో వున్నది......అని అంటూ ఆ గ్రంథాన్ని ఆమె చేతిలో వుంచాడు. ఆ గ్రంథం తెరిచి చూడగానే మొదటి పేజీలో పెద్ద అక్షరాల్లో 'సుమిత్ర' అని పేరు కన్పించింది. ఇక ఏకాదశాధ్యాయంలో వున్న ఆఫోటో తీసి చూసింది. అది సుందరుడైన ఒక పురుషవ్యక్తి ఫోటో. వంకెలొంకెలు తిరిగిన క్రాఫింగుజుట్టూ, ఎంత కఠిన హృదయాన్నయినా నవనీత మొనర్చగల ఆ నవ్వు మొగము-ఫోటో చూడటానికి ఎంతో ముచ్చటగావుంది. ఆ నేత్రాలలో ఏదో విజ్ఞాన స్రవంతి ప్రవహిస్తున్నట్లుగా తోస్తోంది. లలితాదేవి బాగా శ్వాసిస్తూ వేడి నిట్టూర్పు విడిచి యిలా అన్నది. "ఇంతకు ముందువరకు ఒక గడ్డు సమస్య నా మనసును కొరుక్కుని తింటోంది. ఇదికూడా యిపుడు కంటపడటంతో అది మరింత దుర్గమంగా తయారైంది. అయితే యీ గ్రంథం మీకు ఎలా లభించిందంటారు?" "ఒకవారం క్రితం నేను మా మేనల్లుడి పెళ్ళికని నెల్లూరు వెళ్లాను. ఇంత దూరం వచ్చానుకదా అని ఒక ఉదయాన పెన్నానదికి స్నానానికి వెళ్లాను. స్నానంచేసి వస్తూండగా స్నానాలగట్టుకు కొంచెం ఇవతలగా రోడ్డు ప్రక్కనే మట్టి గడ్డలపై యీ పుస్తకం పడివున్నది. ఎవరో మర్చిపోయి వుంటారనే ఉద్దేశంతో వెనక్కు స్నానాలఘట్టంలోకి వెళ్లి అక్కడున్న వారందర్నీ అడిగాను. మాదికాదంటే మాది కాదన్నారు. చివరకు దీన్ని నావెంట తెచ్చుకోక తప్పిందికాదు."

"సరే! యీ గ్రంథాన్నీ, యీ ఫోటోనూ నా వద్ద కొంతకాలం వుండనీయండి యీ సమస్య విషయమై కొంత పరిశోధన సల్పవలసివుంది.''

"అలాగేవుంచి, వాటి సొంతదారులెవరైనా కన్పిస్తే వారికప్పగించండి."

డాక్టర్ లలితాదేవి ఆమర్నాటి జనతా ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి నెల్లూరు వెళ్ళింది. వెళ్ళగానే హోటల్లో ఒకగది తీసుకుంది. భోజనంచేసినాక తీరిగ్గా కూర్చుని దినపత్రికలో చూచిన నంబరు ప్రకారం ఫోన్‌లో పిలిచింది.

"హల్లో! సురూజి వున్నారా?

"నే నేనండి. వున్నాను. తమరెవరు?

"నేను వరంగల్‌లో ఒక లేడిడాక్టర్నండి. ఈ మధ్య ఒక దినపత్రికలో మీ ప్రకటన చూచి మీకు ఒక సంతోషవార్త అందచేద్దామనే కుతూహలంతో బయల్దేరివచ్చాను."

"అట్లానా? చాలా సంతోషమండి. నా జీవిత సుప్తధనాన్ని భద్రంచేసి నాకందివ్వబోతున్న మహాదాతలా మీరు? అయితే మీరు ఇపుడు ఎక్కడ వున్నారో చెప్పండి. మీకొరకు నాటాక్సీని పంపిస్తాను."

"హోటల్ బృందావన్‌లోనండి."

"లలితాదేవి తన బసవద్దకు వచ్చి ఆగిన కారులో ఎక్కింది. కారు ఒక పెద్ద పెంకుటిభవంతి ముందు ఆగింది. దానిపై 'బాలబాలికా విద్యాసదనం' అని లిఖింపబడిన ఒకబోర్డు కట్టివుంది. కారులోనుంచి దిగి లోపలకు వెళ్ళబోతూండగా గుమ్మంలోనే సురూజీ ఎదురై స్వాగతవాక్యాలు పలికి లలితాదేవిని లోపలకు తీసుకొనివెళ్లాడు. గదులన్నీ నిరుపేద బాలబాలికలతో కిటకిటలాడిపోతున్నాయి. మూడు వరండాలు దాటిన పిదప నాలుగో వరండాలోని ఒకవైపునున్న గదిలోకి తీసుకునివెళ్ళాడు. ఆగదిగోడపై 'సురూజీ గది' అని వ్రాసివుంది. పద్ధతిచూస్తే అది ఆఫీసురూమ్‌గా తోస్తోంది. తాను ఒక పేమ్‌కుర్చీలో కూర్చుంటూ

ఆమెకు ఒక అందమైన సోఫా చూపించాడు. గది నాలుగుగోడల్లా వ్రేలాడుతూండిన సుందర చిత్రాలను తిలకిస్తూ సోఫాలో ఆశీనురాలైంది లలితాదేవి.

"సోదరీ! మీ పేరేమో తెల్సుకోవచ్చునా?" అని అడిగాడు గురూజీ, మందస్మితాంకురములైన అధరములను చిన్నగా కదల్చుతూ.

"నా పేరు డాక్టర్ లలితాదేవి అన్నయ్యా" అని వెంటనే ఆమెనుండి జవాబు వెలువడింది. కాని యీ మాట జారిన తరువాత ఆమెకు చాలా విస్మయం కలిగింది. ఈ అజ్ఞాతపురుషుణ్ణి ఇంత అనురాగంగా ఎలా సంబోధింపగలిగానా అని. అయినా అణచుకోలేని వాత్సల్య ప్రవంతి ఏదో ఆమె హృదయాన్ని ఉప్పొంగజేస్తోంది.

"మీ అసలు పేరేమండీ గురూజీ?"

"అందుకు జవాబుగా లెటర్ హెడ్ పేపరొకటి ఆమె ముందుంచాడు గురూజీ. దానిపై 'డి. యమ్. శాయ్. (గురూజీ) ఎం.ఏ, యమ్.ఇడి. బి.యల్.' అని వున్నది.

"కోల్పోయిన నా గుప్తసనం నాకు చేరనున్నదనే సంతృప్తి అలావుంచి, మీదర్శనం కలిగినందుకు ఎంతో సంతోషిస్తున్నాను."

"మీకు అప్పచెల్లెళ్లు ఎంతమందండీ?"

"ఇపుడు ఎవరూ లేరు. ఎన్నడో ఒక చెల్లెలు వుండేదట. ఇప్పుడు ఎక్కడైనా జీవించే వున్నదో, లేదో; తెలియదు. నా చిన్నతనంలోనే అదినాకు దూరమైంది."

'ఎందుకు తనమనసు ఇంత ఆరాటపడుతున్నది? ఈ వ్యక్తి కన్పించింది మొదలు తనశరీరంలోని ప్రతి రక్తాణువూ ఎందువల్లనో ఆక్రోసిస్తున్నది. అత్యంతమైన హృదయావేదనతో పెదవులు కదల్చింది లలితాదేవి.

"ఎన్నడో ఒక చెల్లెలువుండేదా? ఇపుడామె ఏమైందంటారు?"

"అది ఒక చిత్రగాథ. చాలాకాలం ఆ గాథ స్మృతిపథంపై మెరసినపుడల్లా ఏకాంతంగా కూర్చుని ఎంతోసేపు ఏడుస్తుండేవాణ్ణి. కాని యిపుడు యీ సేవాజీవితమునకు అటువంటి పూర్వగాథల్ని మనసులోకి మాటి మాటికీ రప్పించుకోవటం మహాప్రమాదంగా భావించి దీక్షగా వాటిని అదుపులో వుంచాను. మళ్లా యివ్వాళ్ళ స్వాగతంపల్కే సరికి కొంత హృదయపరితాపం తప్పదు. అయినప్పటికీ మీరు విన ఉత్సాహపడుతున్నారు గనుక చెప్తాను.

"నాకు ఆరుసంవత్సరాల వయసపుడు మా తండ్రి కుటుంబసమేతంగా రామేశ్వరయాత్రకు వెళ్ళారు. అపుడు మా చెల్లెలివయసు మూడేళ్ళు. ఒకరోజున మమ్మల్నిద్దరినీ ఒడ్డున కూర్చోపెట్టి మా తల్లిదండ్రు లిరువురూ సముద్రంలోకి దిగి స్నానం చేస్తున్నారు. మేమిద్దరం ఆడుకుంటూ ఆడుకుంటూ వుండగా ఆ జనసమూహంలో ఎవరిదారి వారిదైపోయింది. మా నాన్నగారు ఎన్నోచోట వెతికించారు. పోలీసు రిపోర్టు యిచ్చారు. ఇంకా ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఫలితంగా మూడురోజులైన తరువాత నన్ను ఒక మార్వాడీసేట్ తీసుకునివచ్చి మా నాన్నగారికి అప్పగించి వెళ్ళాడట. కాని చెల్లి అంతమాత్రం తెలియలేదు. ఎన్నోవిధాల కృషిచేశారు. ఏమీ ప్రయోజనం కలగకపోయింది. చివరకు మా అమ్మ కూడా దాని దిగుల్లోనే పరమపదించింది. మా నాన్నగారు కూడా అంతిమక్షణాల్లో దానిపేరు తల్చుకుంటూనే ప్రాణంవిడిచారు. ఇప్పటికి యీ వృత్తాంతంజరిగి ఇరవై ఎనిమిది సంవత్సరాలైంది. అసలు అది జీవించేవున్నదో? లేదో?... గుర్తించడానికి ఆధారములంటూ వున్నవి కాని అవి చాలా జటిలమైనవి. దానికి వక్షస్థలంపై ఒక పెద్ద పుట్టుమచ్చ వుండేదని అంటూండేవారు మా నాన్నగారు. స్త్రీ యొక్క వక్షస్థలం బహిరంగంగా కన్పించేది కాదాయె! ఇంకొకటి కూడా వున్నది. తప్పిపోయిన సమయంలో దానిమెడలో ఒక చంద్రహారం గొలుసుకూడా వున్నదని మా అమ్మ చెప్పింది. ఆ గొలుసులోగల బిళ్ళపై 'డి. చంద్రమతీదేవి' అని మా అమ్మపేరు కూడా వున్నదట. ఆ గొలుసును మా అమ్మ స్నానానికి సముద్రంలోకి దిగుతూ మా చెల్లెలిమెళ్లో వేసిందట. అదికూడా గుప్తంగావుండే సందర్భమేనాయె! ఇక గుర్తించేందుకు యీ ఆధారాలు ఎలావుపయోగపడతవి చెప్పండి. మా చెల్లెలిది కూడా మీ పేరే! కావాలని పట్టుబట్టి మా నాన్నగారితో పోట్లాడి మరీ పెట్టుకుంది ఆ పేరు దానికి మా అమ్మ. అది మా అమ్మమ్మ పేరట. మా అమ్మ పుట్టింటివారి సంప్రదాయంలో స్త్రీల

పేర్లకు చివర 'దేవి'అని పెట్టుకోవటం ఏనాటినుంచో వస్తున్నదట......" కళ్ళనీరు కారుస్తూ మొహం అరిచేతుల్లో పెట్టుకుంది లలితాదేవి.

"ఎందుకు మీరలా బాధపడతారు లలితాదేవి గారు? అది నా దురదృష్టం"

చేతుల్లోని ముఖం పైకెత్తి గుండెల్లోని దుఃఖభారమును అణిచేసుకుంటూ దృఢకంఠస్వరంతో అన్నది లలితాదేవి "నీదికాదు ఆదురదృష్టం. సోదర ప్రేమను పొందుటకు నోచుకోని ఆ అభాగ్యురాలిది. నీవలెనే నీసోదరికూడ ఉన్నతవిద్యావంతురాలే. కాని నీకులేని మానసిక సుఖం ఆమె గొప్పగా అనుభవిస్తున్నది. అశాంతి, అస్థిరత్వాలు ఆమెను సమీపింపవు కూడా."

"ఆఁ! ఏమంటున్నారూ? అంత మహాసుఖజీవా నా చెల్లి! అయితే యిది మీరెట్లా చెప్పగలుగుతున్నారు లలితాదేవిగారూ? జ్యోతిషం ఏమైనా తెలుసా?"

"ఇన్ని చాలక నేను జ్యోతిష విద్వాంసురాలను కావాలని కూడా కోరుకుంటున్నావా అన్నయ్యా?"

"మరి యీ సంగతి తమకు ఎలా తెలుసునంటారు?"

"నా ఆత్మ ప్రబోధం అలా పల్కుస్తోంది."

శాయ్ కొంచెం ముందుకు వొంగిఎంతో శ్రద్ధగా, ఆశగా అడిగాడు.

"మరి అయితే నాకు యీ జన్మలో ఒకతడవైనా సోదరీ సందర్శనం కాగలదంటారా? ఒక్కసారి మీ ఆత్మను అడిగిచూడండి. నా జీవితమంతా మీకు కృతజ్ఞుడనై వుంటాను."

"ఓ, తప్పకుండాను. ఒకతడవేమిటి? వంద తడవలు. వేయితడవలు..."

"ఎప్పుడంటారు?"

"ఈ వారంలోనే."

"ఈవారంలో ఏ రోజునంటారు?"

"శుక్రవారంనాడు."

"ఇవ్వాళేకదా శుక్రవారం."

"ఇరవైనాలుగు గంటలూ యింకా పూర్తికాలేదుగా."

ఇక ఏమాత్రమూ సందేహంలేదు. ఈ ఎదుటి వ్యక్తి తన పుట్టింటి వంశాంకురమే! తాను ఎవరి జీవితాల్నిగురించో పరిశోధనలు చేయవచ్చి మరుగుపడిన తన జీవిత సత్యాలనే తెల్సుకుంది.

శాయ్ కొంచెంసేపు గుబులుగా ఆలోచించి చూసి చివరకు నిరాశతో కృంగిపోతూ యిలా అన్నాడు: "ఏమో నాకేమీ నమ్మకం తోచటంలేదు. మీ జోశ్యంలో. ఏనాటి చెల్లీ? ఎక్కడ వున్నదనీ? ఏమిటో ఇదంతా? సరేగాని మీరు హిందూ జ్యోతిష సిద్ధాంతాల ప్రకారమా లేక పాశ్చాత్య జ్యోతిష..." మాటకు అడ్డుతగిలి కొంచెం విసురుగా అన్నది లలితాదేవి. "ఏ జ్యోతిషాలు చదవనక్కరేదు. నీముఖంలో నేను నాముఖంలో నీవు భావాల్ని చదువుకుంటే చాలు. సరేగాని, నీ చెల్లెలి ముచ్చట్లలోపడి లెదర్ బేగ్ మాట మర్చిపోయినావ్."

శాయ్ మనసులో బాధపడుతున్నాడు. తన చెల్లెలివృత్తాంతం చెప్పినప్పటినుండి యీమె తనపట చాలా నిర్లక్ష్యత చూపుతున్నది. గదమాయింపుగా మాట్లాడుతోంది. అనవసరంగా యీమె ముందు అదంతా వల్లెవేయటంద్వారా లేకితనంగా ప్రవర్తించానేమో అని భావిస్తున్నాడు.

కొంచెంసేపు వూరుకున్నతర్వాత లలితాదేవి అన్నది" ఒకషరతు వున్నది. ఈఫొటోకు సంబంధించిన గాథను నాకు నీవు పూర్తిగా వినిపింపగల పక్షంలోనే నానుండి యీ లెదర్ బేగ్ నీవు పొందగలవుసుమా! నీ పారితోషికంతో కూడా నాకేమీ నిమిత్తంలేదు. పారితోషికాలముష్టితో నీ దయాదాక్షిణ్యాల కొఱకు నేను చెయిజాచనవసరంలేదు. ఉద్దేశమే కలగాలి గాని సహజమైన పద్ధతిలోనే నీమీద దండయాత్ర జరుపగలను."

"నాకు అభ్యంతరంలేదు. ఆ ఫోటో గాథ చెప్తాను వినండి. చివరలో నా వస్తువుని మాత్రం నాకిచ్చేసి వెళ్లండి. మీరు తగిన బహుమతి నానుండి పొందితేనే నాకు సంతృప్తిగా వుంటుంది. నా తలిదండ్రులు నా పదిహేనేళ్ల వయసులోపల మూడు సంవత్సరాల వారగా యీ లోకాన్ని విడిచి వెళ్లారు. ఆ సంవత్సరమే నా చదువు స్కూల్ ఫైనల్ పూర్తయింది. తదుపరి మా మేనమామ ఇంటికి చేరి ఇంటర్ లో ప్రవేశించాను. నేను సూక్ష్మగ్రాహినని నన్ను నేను మెచ్చుకోవటమే కాదు. ఆ విషయం నాకు విద్యనేర్పిన కాలేజీ లెక్చరర్లు కూడా అంటూండేవారు. నాలుగు సంవత్స

రాలలో డిస్టింగ్‌షన్ మార్కులతో ప్యాసై మొదటి తరగతి పట్టభద్రుడనిపించుకున్నాను. ఆ సమయంలోనే నా మనసును ఒక కుసుమకోమలి ఆకర్షించింది. ఆమె పేరు సుమిత్ర. ఆమె అన్నగారు ఆ వూరికి బదిలీ అయి మా మేనమామగారి మేడపైన అద్దెకున్నాడు. ఆమెకూడా నాయందు వలపు నిల్పుకుందని గ్రహించటానికి నాకు యెంతో కాలము పట్టలేదు. ఆ విశ్వమోహాన రూపము ఇప్పటికీ నా మనసులో తళతళ డుతూ చెరగరానిదయిపోయింది. ఆమె అన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోగానే నేను మేడ ఎక్కుతూండేవాడ్ని. ఆ కోమల హస్తాలు నా మెడపై ఎన్ని చుట్లు తిరిగినవో చెప్పలేను. ఆ సుందర వదనం, ఆ పాలబుగ్గలు శాశ్వతంగా నా వస్తువులని భ్రమించాను. ఈ లోకంలో పవిత్రమైన ప్రతిదానికీ శాశ్వతమయ్యే హక్కు కలుగకుండా చేయడానికి కొన్ని మానవహృదయాలు తమ శాయశక్తులా పని చేస్తూంటాయని ఎరుగలేకపోయాను. ఎంత నిర్మలమైన దానిపైనకూడా దాడిసల్పుటకు మానవ దురహంకారం, స్వార్థపరత్వం వెనుకంజవేయవని తదుపరి తెల్సుకున్నాను. స్వార్థంలో వున్న తాత్కాలిక సుఖంపైగల ఆశతో మానవుడు లోకద్రోహ కార్యములకుకూడ సిద్ధపడగలడు. మా ప్రణయ సమాచారమును కొంచెంగా పసిపట్టిన మా మామయ్య ఒకప్రక్కన తన కూతుర్ని తప్పకుండా ఆ మాఘమాసంలోనే వివాహం చేసుకోవాలని పట్టుబట్టి కూర్చున్నాడు. మరొకప్రక్కన ఆమె అన్నకు ఏవేవో బోధలుచేసి అంత తక్కువ వ్యవధిలో ఎక్కడా సబంధందొరక్కపోవుసరికి చివఱకు, స్కూలు ఫైనల్ ప్యాసై ఎక్కతో నల ఫైరూపాయలు తెచ్చుకుంటూన్న తన బావమరిదిచేతనే ఒక ముహూర్తాన వా సుమిత్రకు ఆమూడు ముళ్ళూ వేయించి యిక తన కూతురికి పోటీరాకుండా చూసుకున్నాడు. సుమిత్రకా వివాహాన్ని తప్పించాలని ఎంతో ప్రయత్నించాను. ఆమెకూడా తక్కువ కృషిచేయలేదు. మా ప్రార్థనలన్నిటిని అరణ్యరోదనములుగా మార్చి భగవంతుడు నాసుమిత్రను నానుండి వేరుచేశాడని ఎంతగానో దుఃఖించాను. కాని ఇపుడుమాత్రం భగవంతునిపై అనిందమోపను. లోకానికి యీశాయ్ అనే గురూజీనుండి [illegible] ఒక ..విధమైన సేవ అవసరమై వుండే ఆ పని జరిగిందేమో అనుకుంటాను. లోకానిక్కి పనికివచ్చేవ్యక్తులు భోగాల్లో మునిగిపోవుటకు ఆ సర్వవ్యాపి అంగీకరించలేడేమో! వెన్నెలరాత్రులలో చల్లని జాబిల్లి సాక్షిగా మే మిరువురం చేసుకున్న ప్రతిజ్ఞలన్నీ యీ విధంగా దుఃఖయాతనలుగా పరిణమించటంతో సుమిత్ర వివాహం జరిగిన మర్నాడే చింతాభరితమైన హృదయంతో దేశాటనకు బయల్దేరాను. ఎక్కడెక్కడో తిరిగాను. ఎంతమంది స్నేహితుల ఇండ్లలోనో వున్నాను. ఎన్నో రకాల విద్యల నభ్యసించాను. ఇటు న్యాయశాస్త్రంలోను, అటు ఉపాధ్యాయ విషయికంగానూ పెద్ద డిగ్రీలు పొందానూ. కాని యీ భగ్నప్రణయ వృత్తాంతము మాత్రం నా మనసును క్రుంగదీస్తూనే వుంది. ముఖ్యమైన ఆనందం జీవితంలో లోపించిన తదుపరి, యీ ఉన్నతోద్యోగాలేవి సుఖప్రదములు కాలేవనీ, మనసును నిరంతరం కాటు వేస్తూండిన యీ విషాదసర్పం ఏవుద్యోగ నిర్వహణను జయప్రదం కానివ్వలేదనీ ఒక నిర్ణయానికి రాగలిగాను. ఈ విధంగా అస్థిమితహృదయంతో, అనాలోచితంగా, న్యాయ, విద్యావిషయిక శాస్త్రాలలో గొప్పగా ప్రతిభ కలిగిన యీ వున్నత విద్యావంతుడు వూళ్ళవెంబడి తిరగటం ప్రారంభించాడు. ఇలా జరుగుతూండగా ఒకతడవ యీ బస్తీలో మురికిపేటలో తిరగటం సంభవించింది. ఈ రోడ్ల ప్రక్కల్ని పేవుమెంట్లపై పడివున్న ఆకలిజీవుల దీన దృష్టులు నా గుండెలో రుధిరాన్ని చిలికించినయ్. సమస్త దుర్వ్యాధులకు ఆలవాలమై గాలికి గజగజలాడే యీ నిర్భాగ్య కార్మిక సోదర జీవుల గృహాలు నా శరీరాన్ని కంపరమెత్తించినాయి. చింపిరి పేలికగుడ్డల చాటున మానాభిమానాలు దాచుకుంటూ లోకంలో మానవులమే అనిపించుకుంటూన్నవాళ్లి సతీమణులయొక్క బక్కచిక్కిన దేహాలు నాలోగల ఉన్నత విద్యాగంధాన్ని నిలబెట్టి అడిగినయ్. 'నీవలన మాకు కలుగనున్న ప్రయోజనం ఏమిటి?' అని. వారిబిడ్డల పసిముఖాలు నన్ను దీనంగా దేనికోసరమో అర్థిస్తున్నట్లుగా కన్పించినయ్. సంఘంలో అధఃపతనత పొందిన యీ జీవుల ముందు తరాలవారు కూడా యీ హైన్యజీవితాలు గడుపవలసినదేనా అని ఆలోచిస్తున్నాను రోడ్డు ప్రక్కన పేవుమెంటుపై ఆకలిబాధకు నోరుతెరచి పడివున్న ఒక అభాగ్యునిప్రక్కన కూర్చుని. 'లే! నిలబడు. ముంజేతిని దీక్షాకంకణం ధరించి కార్యరంగంలోకి దూకి లోకం వేపుకు ఆశగాచూస్తోన్న ఆ అమాయిక ముఖా

లకు విద్యాభిక్ష పెట్టు. వ్యర్థప్రయోజనాలకై అమృత వర్షం కురిపించకు. ఉపయోగించేరీతి తెలియకుండా అపసవ్యంగా వాడితే త్యాగమే మానవునికి అరిష్టదాయకం కాగలదు. ఎన్నడో పరులపాలై పోయిన సుమిత్రపై హృదయం నిల్పుకుని నీ ప్రేమశక్తిని బూడిదపాలు చేసుకోకు. అంత దృఢహృదయంతో నీ దేశకళ్యాణం కోరి యీ నిరుపేదజీవులపైకి ఆ పవిత్రప్రేమను మళ్ళించుకో. ఈ మహత్తర సేవావిధానంలో నీ సర్వశక్తుల్నీ లగ్నంచేసి చవిటి నేలగామారిన నీ జీవితక్షేత్రాన్ని సశ్యశ్యామలం చేసుకో అని అంటూ ఏదో అనంతత్వం నన్ను ముందుకుతరిమి కొడుతూన్నట్లుగా తోచింది. వెంటనే కార్యరంగంలోకి ప్రవేశించాను. నా స్వగ్రామం వెళ్ళి నా పిత్రార్జితపు ఆస్తిలో కొంతభాగాన్ని విక్రయించి డబ్బు తీసుకునివచ్చి యీ భవంతి కొన్నాను. ఉచిత పాఠశాలకు కావల్సిన వసతులన్నిటినీ సమకూర్చాను. ఇంకనూ మిగిలివున్న రెండులక్షల విలువగల పిత్రార్జితపు ఆస్తిలో ఫలసాయమును యీ పాఠశాలా నిర్వహణ కొరకు వినియోగిస్తున్నాను. మూడుసంవత్సరాలనుంచీ కేంద్రప్రభుత్వం కొంతగ్రాంటు కూడా యిస్తోంది. అప్పటినుంచీ విద్యార్థుల కూడూ గుడ్డా బాధ్యతనుకూడా విద్యాలయమే తనపైన వేసుకున్నది. పెద్దవారికొఱకు కూడా కొన్ని గంజి కేంద్రాలు నిర్వహిస్తోంది. ఈ సేవానురక్తి సుమిత్రపైగల నిశ్చలప్రేమకు ఒక క్రొత్తబాట కల్పించింది. ఈనాడు సుమిత్రను నేను ఒక ఆడదానిని మాదిరిగా ఏ వాంఛల్తోనూ ప్రేమించటం లేదు. ఉత్తమ కార్యాచరణను ఉన్నత దృష్టినీ ప్రసాదించింది. ఆమెను ఒక దేవతగా భావించి రోజూ పరమేశ్వరారాధన పూర్తిచేసుకున్న తదుపరి ఆమె ఫోటోను ఒక్కతడవ చూసుకుని దానియెడల నాకుగల భక్తిప్రపత్తులను వెల్లడిచేసుకుంటూ వుంటాను. ఆఫోటో ఎపుడూ ఆలెదర్ బేగ్ లోనే వుంటూవుంటుంది. ప్రయాణ సమయాలలోకూడా అది నా వెంట వుండే అలవాటు. ఈతడవ ఆఫోటో నాకుదూరమై పది దినాలైంది. మనసులో గుబులుగా వుంది. ఇది నా సుమిత్ర జీవితానికి ఏదైనా అశుభశకునమేమో నని భయపడుతున్నాను. తనకు ఉపయోగపడనంత మాత్రాన, తాను ప్రేమించినవస్తువు నశించిపోవాలనిగాని బాధపడాలనిగాని కోరేవ్యక్తి పరమ నీచుడు! నేనెప్పుడూ నా సుమిత్రక్షేమాన్నే కోరుతూంటాను. స్త్రీకి జీవిత మంతా ఒకే భర్త అని ఎలా శాసించినవో, ఆరీతిగనే పురుషుని జీవితానికి కూడా ఒకేభార్యఅని నిర్ధరించివుంటే మన ధర్మశాస్త్రాలు యింకా పరమపవిత్రంగా పరిగణింపబడేవనుకుంటాను. నా మానసపథంలో ధ్రువతారగా వెలుగుతూన్న సుమిత్రకు అర్పించిన యీ హృదయాన్ని మరొకరికి ధారపోయటం నాకు చేతగానిపని. జీవం ఎగిరపోయిన తదుపరి నా బొందెవలనకూడా ఆపని ఎవరూ చేయించలేరేమో? అందుచే బాహ్యలోకానికి బ్రహ్మచారిగానే వుండిపోయాను.

ఇంతసేపూ లలితాదేవి చాలా ఓర్పుగా విని చివరకు కొంచెం వెటకారంగా అన్నది. "బాగుంది! నీ గాథ చాలా బాగుంది అన్నాయ్! ఇంత వున్నత విద్యావంతుడవయ్యీ కూడా వంశాన్ని నిలుపలేకపోయావ్. టాక్సీలో నన్ను నా బసకు పంపండి. తదుపరి ఒక గంటలోపల మిమ్మల్ని తిరిగికల్సుకుంటాను. అప్పుడు మీ లెదర్ బేగ్ మీకు అప్పచెప్పగలను."

"అలాగే. ఈ దీనుడియొక్క మరియొక ప్రార్థనను కూడా తప్పకుండా మన్నించి తీరగలరని తలుస్తాను. మీ జ్యోతిష పాండిత్యము నుపయోగించి నా చెల్లెలి సమాచారం వెల్లడిచేయడమే గాకుండా నా భవిష్యత్తుని గురించి కూడా కొంచెం ఆలోచించి చూడండి. ముఖ్యంగా మా చెల్లెలిసమాచారం మీ జోశ్య ప్రకారం జరిగితే జ్యోతిషమార్తాండ, జ్యోతిషరత్న మొదలగు బిరుదు లిప్పించి గొప్పగా సన్మానించగలను."

దుఃఖభారంతో వివర్ణమైపోయిన లలితాదేవి లేచి నిలబడి ఉక్రోశంగా అన్నది "నీబిరుద ప్రదానాలూ నాకక్కర్లేదు. నీ సన్మానాలూ నాకవసరం లేదు."

లలితాదేవి ముందుకు సాగిపోతూన్నది. ఆమె మాటలు సరిగా అర్థంగాక కలవరపడి పోతూన్న శాయ్ ఆమె వెనుకనే వచ్చి గేటులో నిలబడి 'తప్పకుండా గంటలోపల రాండి' అని చెప్పి లోపలకు వెళ్ళిపోయాడు. తాను కారులో ఎక్కబోతూండగా ఎదుటి ఇంటి కిటికీ సందుల్లో నుంచి రెండు నేత్రాలు సూటిగా తనపై దృష్టి బఱపినట్లు లలితాదేవి గమనించలేదు. వెంటనే ఒక కుఱ్ఱవాడు కారు బయల్దేరపోతూండగా వచ్చి "ఏమండీ, మా అమ్మగారికి మీరు తెల్సునట. ఒక తడవవచ్చి వెళ్లమన్నారండి" అని చెప్పాడు. లలితాదేవి కారునుంచి దిగి కుఱ్ఱవాడి వెనుకనే నడిచి ఆతృణగృహంలోకి ప్రవేశించింది.

తలుపు రెక్కచాటు నుండి ఇలా ధ్వనించింది "ఏమే లలితా? కులాసాగా వున్నావా? నిన్ను ఎంత కాలానికి చూడగలిగాను?

ఆ కంఠ స్వరం ఎన్నడో తనకు చాలా సుపరిచితమైనట్లు తోచింది లలితాదేవికి. మరల అదే ప్రదేశాన్నుండి యీ విధంగా మాటలు వెలువడినాయి "బాగా ఇంగ్లీషు చదువు చదివినట్లున్నావు. ఏదైనా ఉద్యోగం కూడా చేస్తున్నావా? అదృష్టవంతురాలివి!"

ఆ వెంటనే తలపైని ముసుగు సరుకుంటూ అసలు స్వరూపమే ప్రత్యక్షమైంది. "నన్ను గుర్తుపట్టలేదా? నేను సుమిత్రను కదే!"

లలితాదేవి నివ్వెఱపోయి చూస్తోంది. ఒక నిమిష కాలంపాటు ఆమె మనసు పనిచేయటం మానేసింది.

"ఏమిటే ఆ వెఱ్ఱిచూపులూ నువ్వూను! నేను "సుమిత్రను లలితా."

"నువ్వా ఆ గురూజీ నన్ను నిజంగానే వెఱ్ఱిదాన్ని చేస్తున్నారు సుమిత్రా. నువ్విక్కడ వుంటున్నావా ఏం? నీకు వైధవ్యం వచ్చిందా? అసలిలా మారిపోయినావేమిటి?"

"అవును. నాకు వైధవ్యం వచ్చి నాలుగేండ్లయింది లలితా. వీడు నా ఏకైక సంతానం. అసలువారు పిత్రార్జితపు ఆస్తిపాస్తులు కలవారు కారు. బ్రతికివున్నన్నాళ్ళూ మంచి వుద్యోగమే చేశారు. జీవనానికి లోటులేకుండా గడిచిపోయింది. ఆయన మరణించిన మర్నాటి నుండీ నా కష్టదశ ప్రారంభమైంది. అన్నలు మనవాళ్ళయితే వదినెలు మనవాళ్ళు కారుకదా! నీకు తోబుట్టిన వాళ్ళెవరూ లేకపోవటం చేత ఆ గొడవలు నీకు తెలియవు.. ...వెంటనే లలితాదేవి కలవరపడుతూ సుమిత్ర మాటలకు అడ్డుతగిలి 'సుమిత్రా అట్లా అనకు. నాకూ నా తండ్రివంశాంకురంగా ఒకతోబుట్టిన వాడున్నాడు. వాడు ఎవరో నీవుకొన్ని నిమిషాలలో నే తెలిసికోవగలవు' అన్నది.

'అట్లాగా. ఆ సంగతి నాకు తెలియదుకదా! ఎన్నో అవస్థలుపడ్డాను. ఎన్నో దూషణ వాక్యాల్ని గుండెల్లో దాచుకున్నాను. అన్నగారి ఇంట్లో నుంచి గెంటింపబడ్డాను. చివరకు నాకు యీ మురికిపేటను గమ్యస్థానంగా చూపింది విధి. మా కుఱ్ఱవాని ప్రార్థనలు ఆ గురూజీగారికి మా పై కరుణ కలుగజేసినయ్. వాణ్ణి స్కూల్లో జేర్పుకున్నారు. మాకు యీ నివాస స్థానం చూపించారు. ఇక్కడ నుంచే భోజనం వారికి మావాడు ప్రతిరోజూ తీసుకువెళుతూంటాడు. అందుకుగాను ముట్టే ప్రతిఫలంతో నా కడుపుగడుస్తోంది కుఱ్ఱవాడు అక్కడే భోజనం చేస్తూంటాడు. దైవసర్మణ చేసుకుంటూ ఈ వైధవ్య జీవితం గడుపుకుంటున్నాను.

"అయితే, నీవు ఇక్కడకు వచ్చిన తర్వాత ఎన్నడూ గురూజీని చూడలేదా సుమిత్రా?

"లేదు. ఒక్క గురూజీనేకాదు. ఏ పురుషవ్యక్తి కంటనూ పడకుండా కాలం గడుపుకుంటున్నాను. కాని ఆ మహనీయుణ్ణి గురించి మావాడి వల్ల విన్నాను. వారి దయారసమును గూర్చి యీ పేటలోని ప్రజలు అనేక కథలు చెప్పుకుంటారు. ఆయన వారి దృష్టిలో లోకాతీతులు. నేను భగవద్గీత చదివి వినిపిస్తున్నప్పుడు ఇక్కడి అమ్మలక్కలు అందులోని శ్రీకృష్ణపరమాత్మనిపాత్ర అద్భుంగా గురూజీని జ్ఞాపకం చేస్తోందంటారు......" మాటలకు అడ్డు తగిలి ఇలా ప్రశ్నించింది లలితాదేవి.

"భగవద్గీత కూడా చదువుతున్నావా ఏం? ఏది చూద్దాం ఆ గ్రంథం ఒకసారి యిటుతీసుకునిరా."

"పదిహేనురోజుల క్రితం పిన్న ఒడ్డున మర్చిపోయాను లలితా. దానితోబాటు అందులో వుంచి వున్న ఒక అమూల్యవస్తువునుకూడా కోల్పోయాను" అని అన్నది సుమిత్ర విషాదంగా.

వెంటనే లలిత తన జాకెట్ జేబులో నుంచి తీసి రెండుచేతుల్లో రెండింటినీ పట్టుకుని చూపిస్తూ చిరునవ్వుతో అడిగింది "ఇదేనా నీ భగవద్గీత? ఈ ఫోటోయేనా ఆ అమూల్యవస్తువు?"

అత్యంతవిస్మయం ప్రదర్శిస్తూ సుమిత్ర అన్నది "అవును. అవే నా జీవిత" అమూల్య వస్తువులు లలితా. నన్ను భగవంతుడు ఎంతో కరుణించాడు. గుండెల్లో దాచుకోగలిగిన ఆ ప్రతిగల నాబాల్య స్నేహితురాలి హస్తాల్లోనే నా మానాభిమానమునకు మూలకందమైన దాన్ని విసిరి వేశాడు. బ్రతికి పోయాను!" అని అంటూ కళ్ళు మూసుకుంది. ఆ కండ్ల మూలలనుండి జలబిందువులు జలజలా రాలుతున్నాయి.

"సుమిత్రా! యీ ఫోటోలో వున్న వారితో నీకు గల సంబంధాన్ని గూర్చి ముక్తసరిగా మూడు ముక్కల్లో చెప్పు వింటాను."

"నేను చాలా దురదృష్టవంతురాల్ని లలితా. మనసు ఒకరితో, మనువు ఒకరితో సంభవించింది. నా అనుమతితో అవసరం లేకుండానే బలవంతంగా, ముష్కరంగా నా చేతుల్తో నా మదన్ శాయికి ఇతరులు ద్రోహం చేయించారు. నా యీ శరీరాన్ని ఇతరుల కౌగిళ్లలో కులికించి సంసార జీవితాన్ని నిర్వహించానుగాని అతను మటుకు తన ప్రతిజ్ఞా పరిపాలన అక్షరాలా జరుపుకున్నాడు. నేను హిందూ స్త్రీని కావటంచేత మనసును చాలా అదుపులో వుంచుకుని కట్టుకున్న వారికి చాలా విధేయురాలుగా వుండి కాలక్షేపం చేశాను. కాని సృష్టి ధర్మాలను ఎవరూ అతిక్రమింపలేరుకదా! ఆత్మ అనేది లేకపోతే వెనక చూపు లేకుండా మానవుడు ఎన్ని పనులేనా చేసుకుని పోతూ వుండవచ్చు! మంగళసూత్రమే మనసును తనపాదాలక్రింద అణచిపెట్టివుంచగలదనుకునే వాళ్లువట్టి పిచ్చివాళ్లుసుమా! ఎంత ప్రయత్నించినప్పటికీ నాకు సూత్రధారణ చేసిన భర్తను నేను హృదయంనిండా ప్రేమించలేకపోయాను. ఆయన చాలా మంచివారు. నాయందు చాలా ప్రేమగా వుండేవారు. ఈ విధంగా ఆరు సంవత్సరాల పాటు కాలక్షేపం జరిగింది. తదుపరి ఆయన దైవంయొక్క ఆదేశం ప్రకారం పరలోకానికి వెళ్ళిపోయారు. నా తొలివలపును పొందిన మదన్ శాయ్ నాకోసం చేసిన త్యాగాలన్నీ నాహృదయంలో ఆయనకు అత్యుత్తమ స్థానాన్ని యిచ్చినయ్. కామవాంఛల మాలిన్యం ఆ పవిత్ర మూర్తికి అంటచేయకూడదనుకున్నాను. ఆయన్ని దైవంగా ఎంచుకుని ఆయన ఫోటోను శ్రీ కృష్ణపరమాత్ముని ప్రతిమ ప్రక్కగావుంచి పూజిస్తూంటాను.

"మదనశాయ్‌కూడా నిన్ను దేవతగానే భావించుకుని ఆరాధించుకుంటున్నాడు. నీవియోగాగ్ని అపవ్యవస్థిత మనస్సుతో దేశద్రిమ్మరిగా తిప్పినప్పటికీ లోకంలో పీడితప్రజలపాలిట ఒక మాణిక్యంగా మార్చివేసింది. కాని ఇక్కడి విచిత్ర మేమంటే, ఎదురుబడి ఇళ్లల్లో రెండు సంవత్సరాలనుంచీ వుంటూ ఒకర్ని ఒకరు గుర్తించుకోలేక దొంగచాటున మాదిరిగా ఒకర్నొకరు ఆరాధించుకుంటున్నారు."

"ఏమిటంటున్నావ్ లలితా? నువ్వు చెప్పేది నాకర్థం కావటంలేదు." లలిత లెదర్ బేగ్ తెరిచి సుమిత్రకు చూపి అడిగింది. "ఇది నీవు బాగా పడుచుతనంలో వున్నపుడు తీయించుకున్న ఫోటోకదూ" అవును. మాకడసారి సమావేశంలో తన చేతికెమేరాతో యీ ఫోటో తీసి శాయ్ తన దగ్గఱ వుంచుకున్నాడు. తనఫోటో ఒకటి నాకు యిచ్చి 'సుమిత్రా? ఇవే మనకు యిక దివ్యస్మృతులు' అన్నాడు. ఆసమయంలో నా శాయ్ నాకు ఇంకా చెప్పిన కొన్ని మాటలు ఇప్పటికీ నా మనసులో ఖంగున ధ్వనిస్తూనే వుంటాయి: 'సుమిత్రా? యిది నలుగురికీ తెలిసిన చరిత్ర. ఈ వూరు హద్దుల వరకు యిది గుప్త విషయమేమీ కాదు. నీవు గృహస్థాశ్రమాన్ని సరిగా నిర్వహించలేకపోతే, లోకులు యీ మదనశాయ్ వెధవ దాని కాపురాన్ని కాస్తా పాటన పెట్టుకున్నాడని నన్ను దూషిస్తారు. అసలే అశాంతితో కుళ్ళిపోయే యీ దౌర్భాగ్య జీవియొక్క శిరస్సుపై అనిందా భారం ఒకటి మోపబోకు. ధర్మశాస్త్రాలను గౌరవించే వాడినే వాటిని చూపి ఇతరులు బెదరకొడుతూంటారు. నిన్ను ఇపుడున్న దాన్ని ఉన్నట్లుగా యిక్కడ్నుంచి తప్పించి నా భార్యగా చేసుకోదగు ధైర్యం నాకు లేకపోలేదు. ఉపాయం తెలియక కాదు. ఈ సందర్భంలో స్వేచ్ఛావిహార విధానం అవలంబించి నీపవిత్ర జీవితాన్ని అపఖ్యాతి పాలు చేయటం నాకు ఇష్టంలేదు. ఇతరులు నిందాస్పదంగా చూచే ప్రేమను నేను భరించలేను. సుగుణాలరాశివైన నిన్నుకూడా అటువంటి హేయస్థితిలో దింపుటకు నాకు ఏమాత్రమూ ఇష్టంలేదు. అన్నాడు- కాని యీఫోటో నీచేతికి ఎలా వచ్చింది లలితా?"

"నీ మాదిరిగానే శాయికూడా నీఫోటో పోగొట్టుకున్నాడు. అది నా చేతికి చిక్కింది. దాన్ని గురూజీకి అప్పచెప్పి పోదామని వచ్చాను."

"అదేమిటి లలితా, గురూజీకి అప్పచెప్పటం దేనికి?"

"గురూజీ, మదనశాయి-యీ రెండు పేర్లూ ఒకరివే గనుక. ఓసి పిచ్చివదినా! అతడు నీ మదనశాయ్..."

వేడెక్కిపోయిన తలను రెండు చేతుల్తోనూ నొక్కిపట్టుకుని కూర్చుంది సుమిత్ర. ఆమె నేత్రాలలో వేగంగా అశ్రువులూరుతున్నాయి. రెండు నిముషాల పాటు వూరుకుని తదుపరి అన్నది. "అయితే, ఇపుడు యీ తృణగృహంలో తన ఆదరణక్రింద జీవిస్తున్న మనిషి సుమిత్ర అని ఆయనకు తెలుసా?"

"తెలియదు"

వెంటనే సుమిత్ర లలితకు దగ్గరగా జరిగి ఆమె రెండు చేతులూ పట్టుకుని యిలా ప్రార్థించింది. "బాల్య స్నేహితురాలవు-లలితా! నీ నుండి నాకు ఒక వరం కావాలి. అందుకు నీవు సమ్మతించకపోతే, యీ బట్టకొంగుతో నా కంఠానికి ఉరిబిగించుకుని ఈ ప్రాణాన్ని విడిచేస్తాను."

"అంత పని ఎందుకు సుమిత్రా? వర మేమిటి? ఆదేశించు."

"నీ ఎదుటె యింట్లో వుంటూ నీ ఆదరణ క్రింద జీవిస్తూన్న మనిషి సుమిత్రే అనిగాని, ఆమె నిన్ను దైవంగా ఎంచుకుని ఆరాధిస్తోందనిగాని ఎన్నడూ ఆయనకు తెలియజేయనని నీ నుండి నాకు వాగ్దానం కావాలి."

"ఆ విధంగా నే చేయగలనని నీకు అభయమిస్తున్నాను. ఇక శెలవు తీసుకుంటాను సుమిత్రా" అని అంటూ లలితాదేవి బయటకు వచ్చేసి గబగబా నడుస్తూ ఒక్క అంగలో గురూజీ గదిలోకి వెళ్ళింది. వార్తాపత్రిక చూచుకుంటూ యీజీచైర్ లో కూర్చున్న గురూజీ దాన్ని మేజాబల్లపైకి విసిరి 'కూర్చోండి లలితాదేవిగారు' అన్నాడు.

కాని లలితాదేవి కూర్చోకుండానే గురూజీకి చాలా దగ్గరకు వెళ్ళి నిలబడి "సరేకాని, నీ చెల్లెలు నీకిప్పుడు కన్పిస్తే ఏమిచేస్తావ్?" అని అడిగింది గంభీరంగా.

అతను చిరునవ్వుతో జవాబు చెప్పాడు. "చాలా ఆనందిస్తాను."

"అట్లాగా? అని అంటూ లలితాదేవి తన జాకెట్ గుండీ వూడతీసి తన వక్షస్థలంపైనగల పెద్ద పుట్టుమచ్చను చూపి, తరువాత తన మెళ్లో వున్న చంద్రహారం గొలుసు అతని చేతిలో వుంచింది. దానికిగల బిళ్లపై 'డి. చంద్రమతీదేవి' అనే పేరుగల అక్షరాలు మిలమిలా మెరుస్తున్నాయి. రెండు నిమిషాలకాలం గడిచినాక తన విషయం యీవిధంగా చెప్పింది లలితాదేవి.

"నేను మద్రాసులో కేథలిక్ చర్చికి చెందిన ఒక క్రైస్తవ మతగురువు చేతుల్లో పెరిగి పెద్దాన్నయినాను. నీవు చెప్పిన విధంగా నేను తప్పిపోయిన తరువాత ఇసుక తిన్నెల్లో నిర్మానుష్యమైనచోట శోష వచ్చి పడిపోయి వుండగా చూచి ఆయన నన్ను తీసుకునివెళ్ళి శీతలోపచారములు చేసి రక్షించాడు. ఆయన నాతో ఆ మాట ఒకప్పుడు చెప్పాడు. ఆయన నాయందు పితృప్రేమతో మెలుగుతూ చదువు సంధ్యలు నేర్పించాడు. ఆయన బ్రహ్మచారి. 'నాకు క్రీస్తుదేవుడిచ్చిన కుమార్తెవమ్మా నీవు' అని అంటూండేవాడు. ఒక ఇంటిదాన్ని చెయ్యాలని ఆయన ఎంత ప్రయత్నించినప్పటికీ అవివాహితగానే వుండిపోగలనని దీక్ష వహించాను. నేను వైద్య విద్యలో పట్టా పొంది ప్రాక్టీసు ప్రారంభించిన కొంత కాలానికే ఆయన కాలం చేశాడు. హిందూ నామధేయం వుంచుకునే ఏసుక్రీస్తుదేవుని ఆరాధనకు ఆయన నాకు అనుజ్ఞ యిచ్చాడు. నేను ఆయనకు దొరికిన కొన్ని గంటలకు నాకు తెలివి వచ్చిన తర్వాత 'నీ పేరు ఏమిటమ్మా' అని ఆయన అడగానే, వచ్చీరాని ముద్దుమాటల్లో 'లలితాదేవి' అని బదులు చెప్పానట. ఇక మిగతా సమాచార మేమీ చెప్పలేకపోయానట. అందుచేత ఆ పేరుతోనే ఆయన నన్ను పిలుస్తూ వచ్చాడు. మద్రాసులోనే కొంతకాలం ప్రాక్టీసు పెట్టకున్నాను. తరువాత వరంగల్ లో మా చర్చికి సంబంధించిన కొన్ని విషయాలను చూడవలసి వచ్చినందువల్ల ప్రాక్టీసు అక్కడకు మార్చుకున్నాను. ఈ క్రైస్తవ లలితాదేవి యీ హిందూ మదనశాయి, అన్నా చెల్లెళ్ళుగా యిప్పటికైనా తెల్సుకోగల్గినందువలన స్వర్గవాసులగు మన తల్లిదండ్రులకు ఆత్మశాంతి చేకూరగలదనుకుంటాను."

లలితాదేవి వెళ్ళిపోయిన తరువాత సుమిత్ర ఒక అరగంటసేపు దీర్ఘంగా ఆలోచించి తరువాత తనకుగల ఆ కొద్ది సామానూ ఒక సంచీలో సర్దుకుని కూర్చుంది.

ఆనాటి అర్ధరాత్రి పన్నెండుగంటల సమయాన గాఢనిద్రలో మునిగివున్న తన కుమారుణ్ణి లేపి కూర్చోపెట్టి "ఇక వెళదాం లేనాయనా" అన్నది.

"ఎక్కడికమ్మా?" అని అడిగాడు జీవన్ కండ్లు నలుపుకుంటూ.

"ముందు యీవూరునుంచి బయల్దేరుదాం. ఆ తరువాత ఎక్కడికి భగవంతుడు దారి చూపిస్తే అక్కడకు వెళదాం."

"అంత అవసర మేమి వచ్చిందమ్మా? ఇక్కడ గురూజీ దయవల్ల సుఖంగా గడుస్తోందికదా! నాకు పరీక్షలు కూడా సమీపిస్తున్నయ్." అని తన తల్లి రెండు చేతులూ పట్టుకుని దీనంగా బ్రతిమాలుతూ అగినాడు ముక్కుపచ్చలారని మాతృభక్తిపరుడైన ఆ పసికందు. దుఃఖభారంతో కంఠం గదద మవుతూండగా సుమిత్ర ఇలా అన్నది. "జీవన్! నీవు కొంచెం పెద్దవాడివై నీకు రెక్కలు వచ్చేదాకా నేను చావదల్చుకోలేదు. నా మరణ వ్యాధిని సూచిస్తూ ప్రతిక్షణమూ గంటలు వినిపిస్తూన్న యీ భయంకర వాతావరణమును నేను భరించలేనురా" ఆ మాటల్లోని తాత్పర్యాన్ని ఆ లేత మనసు గ్రహించలేక పోయినప్పటికీ మాతృదేవియొక్క విషాదవదనం వాని గుండెల్లో అదురుతీగెలు ప్రాకించింది. "అట్లాగేనమ్మా" అని అంటూ నిలబడ్డాడు జీవన్. ఒక సంచీ వానినెత్తిపైకెత్తింది. మరొక దాన్ని తాను చేత్తో తీసుకుంది. ముందు సుమిత్ర ఆమె వెనుక జీవన్—వారిరువురూ గమ్యస్థాన నిర్ణయం లేకుండానే ఆ నిశీథకాళరాత్రిలో ఎక్కడికో ఆ వరిపొలాలగట్ల వెంట నడిచి పోతూన్నారు.